అధిక లోడుతో బొగ్గు రవాణా

- లారీల నుంచి నేల రాలుతున్న నల్ల బంగారం
- బొగ్గు రవ్వలతో వాహనచోదకులకు కళ్లమంటలు
- ఇళ్లు మసిబారి స్థానికుల అవస్థలు



పరిమితిని మించి లోడుతో వెళ్తున్న లారీ



అగనంపూడి టోల్‌గేటు దాటిన తరువాత ఆర్టీఏ కార్యాలయం సమీపంలో హైవేపై కుప్పలుగా చేరిన బొగ్గు రవ్వలు



అగనంపూడి ఫ్లైఓవర్ వంతెనపై బొగ్గు రవ్వలతో నల్లగా మారిన జాతీయ రహదారి

అగనంపూడి: పరిమితిని మించిన లోడుతో లారీల్లో బొగ్గు రవాణా చేస్తుండటంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వందలాదిగా లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటంతో వాహనాల నుంచి బొగ్గురవ్వలు రాలి, కళ్లమంటలతో అవస్థలు పడుతున్నారు. లారీలు వేగంగా వెళ్తుండడంతో దుమ్ము విపరీతంగా పైకిలేచి ఇళ్లల్లోకి వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు.

గంగవరం పోర్టు నుంచి హిందూజా పవర్ ప్లాంట్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వందలాది లారీలతో బొగ్గు రవాణా జరుగుతోంది. నిత్యం జాతీయ రహదారి మీదుగా వాహనాలు ఓవర్ లోడ్‌తో బొగ్గును రవాణా చేస్తుండడంతో రహదారి పొడవునా జారిపడుతున్నాయి. బొగ్గుతో పాటు బొగ్గు రవ్వలు కింద పడుతుండడంతో లారీలను అనుసరించి వెళ్లే వాహనచోదకుల కళ్లల్లో పడి కళ్ల మంటలను కల్గిస్తున్నాయి. కూర్మన్నపాలెం టోల్‌గేటుకు రెండు వైపులా, ఆర్టీఏ కార్యాలయం, అగనంపూడి వంతెనకు రెండు వైపులా, లంకెలపాలెం వద్ద రహదారికి ఎడమ వైపున రహదారి బొగ్గుతో నిండిపోయి నల్లగా మారిపోయింది. పెద్ద గాలి వీస్తే రహదారిపై చేరిన బొగ్గు రవ్వలు వాహనచోదకుల కళ్లల్లో పడుతున్నాయి.

అగనంపూడి ఫ్లైఓవర్ వంతెన మొదలుకుని లంకెలపాలెం ఫ్లైఓవర్ వరకు రోడ్డంతా నల్లగా మారిపోయింది. రోడ్డుకు ఎడమ వైపున బొగ్గు రవ్వలతో నల్లగా మారిపోయి చిన్నపాటి వర్షం కురిసినా రహదారి నల్లబారిపోయి మురుగునీటితో నిండిపోతుంది. జాతీయ రహదారిపై గోతులు ఉన్న చోట అధికంగా బొగ్గు పడుతోంది. వంతెనలపై మరీ దారుణంగా బొగ్గు నిల్వలు చేరిపోయాయి. ఓవర్ లోడ్‌తో రవాణా చేసే లారీలపై చర్యలు తీసుకోవాలని, దారి పొడవునా చేరిన బొగ్గును తొలగించే ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇళ్లు మసిబారిపోతున్నాయి

లంకెలపాలెం కూడలి నుంచి నాలుగు వైపుల మార్గాలు బొగ్గు రవ్వలతో నిండిపోయాయి. లంకెలపాలెంలో ఇళ్లల్లోకి కూడా బొగ్గురవ్వలు ఎగిరిపడుతూ ఇళ్ల ఆవరణాలు నల్లగా మారిపోతున్నాయి. గాజువాక, సబ్బవరం, ఫార్మాసిటీ రోడ్డు బొగ్గుమయంగా మారింది. స్థానికులు నిత్యం కళ్ల మంటలతో ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారు జామున, రాత్రి పది గంటల దాటిన తరువాత బొగ్గు లారీల హోరుతో లంకెలపాలెం వాసులం ఉక్కిరిబిక్కిరవుతున్నాం. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– డి.శ్రీరామ్, శ్రీరామ్‌నగర్ కాలనీ

కళ్లమంటలతో ఇబ్బంది పడుతున్నాం

కూర్మన్నపాలెం నుంచి లంకెలపాలెం వెళ్లే మార్గంలోని రహదారికి ఎడమ వైపున రోడ్డంతా నల్లగా మారిపోయింది. బొగ్గు వాహనాల వెంబడి ద్విచక్రవాహనాలు వెళ్తుంటే గాలికి కళ్లల్లో పడుతుంది. దీంతో కళ్లు ఎర్రగా మారిపోతున్నాయి. అధికారులు చర్యలు చేపట్టాలి.

– బి.రవి, పెదమడక

క్లుప్తంగా

విద్యార్థులకు యోగా శిక్షణ



విద్యార్థులతో యోగా చేయిస్తున్న గ్రంథాలయాధికారి రమణ

పెదగంట్యాడ: యోగ సాధన వల్ల శరీరాన్ని ఆరోగ్యంగా, మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో సోమవారం యోగా చేయించారు. వారితో వివిధ రకాల కథల పుస్తకాలు చదివించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

నీటి సరఫరా బంద్ నేడు

అగనంపూడి: జీవీఎంసీ జోన్–6 పరిధి సిద్ధార్థ నగర్ 12 ఎంఎల్‌డీ పంప్ హౌస్‌లో అత్యవసర పనులు, మరమ్మతులు చేపట్టనున్న కారణంగా సంబంధిత ప్రాంతాల్లో మంగళవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు జీవీఎంసీ (నీటి సరఫరా) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కనకారావు తెలిపారు. ఈ కారణంగా 86, 87 వార్డుల పరిధిలో ఈ నెల 28న మంచినీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ఇటీవల యాజమాన్యం ఏకపక్షంగా పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికుల క్వార్టర్ల విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా స్టీల్ సీపీఎం ఆధ్వర్యంలో ఉక్కు టౌన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కర్మాగారం కొన్న రేటుకే గృహ వినియోగదారులు చెల్లించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటువంటి అనాలోచిత చర్యలను యాజమాన్యం విరమించుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.విమల, పి.శ్రీనివాసరాజు, స్టీల్ సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల రికార్డుల పరిశీలన



వాహనంలో రికార్డును పరిశీలిస్తున్న 108 జోనల్ మేనేజర్ నజీర్

మహారాణిపేట : గర్భిణులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించాల్సిన అంశాలను ఈఎంటీలకు 108 విభాగ జోనల్ మేనేజర్ నజీర్ వివరించారు. సోమవారం ఆయన కేజీహెచ్ గైనిక్, అత్యవసర వార్డులను సందర్శించి, రోగులను ఏ విధంగా పెద్దాస్పత్రికి తరలిస్తున్నారో వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 102,104,108వాహనాల్లో మందుల కొరత ఉండకూడదని, వాహనాలు కూడా శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం 108 రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో 108 విభాగ విశాఖ సిటీ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’కు వర్కింగ్ క్యాపిటల్ అందించాలి



మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం వర్కింగ్ క్యాపిటల్ అందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు కోరారు. నష్టాలను అధిగమించాలంటే వర్కింగ్ క్యాపిటల్ అందించాలని లేదా సొంత గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో 1201వ రోజు, సోమవారం కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని నష్టాల ఊబిలోకి నెట్టి, తద్వారా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి పడరాని పాట్లు పడుతోందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రగతి కోసం కార్మికులు ఎన్నో ఏళ్ల శ్రమించారని, అలాంటి పరిశ్రమను ఇప్పుడు ప్రైవేట్ పరం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, కార్మికుల శ్రేయస్సు కోసం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీఎన్ రాజు, డీసీహెచ్ వెంకటేశ్వర్లు ప్రసంగించారు. నాయకులు ఎన్నేటి రమణ, జయ, నివాస్, ఎం.వి.రమణ, కనకరాజు, దాసరి శ్రీనివాస్, ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఏయూ టాపర్‌గా ఎంవీఆర్ విద్యార్థి



భావనను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ రామారావు తదితరులు

గాజువాక : స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థిని మెండా భావన వార్షిక పరీక్షలలో ఆంధ్రా యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ బయో టెక్నాలజీ (ఎంబీ బీసీ బీటీ) విభాగంలో ఆమె 9.91 సీజీపీఏ సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భావనను అభినందించారు. ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడల్లో విజేతలకు బహుమతులు



చిన్నారులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక : వేసవి శిబిరంలో భాగంగా స్థానిక డిజైర్ సొసైటీలోని హెచ్ఐవీ బాధిత చిన్నారులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు సోమవారం బహుమతులను అందజేశారు. కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు చేతులమీదుగా చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు, స్కూల్ బ్యాగులను బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి వేసవి శిబిరాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో డిజైర్ సొసైటీ నిర్వాహకుడు రవిబాబు, స్థానిక పెద్దలు పరశురామ్, నాయుడు, వీరయ్య, సంస్థ గాజువాక ఇన్‌చార్జి లక్ష్మణ్, టీచర్ రజని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగ మహోత్సవాలు



నాతయ్యపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద తీన్‌మార్ సందడి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామదేవతలైన బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వార్ల నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి నాతయ్యపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తీన్‌మార్ బ్యాండ్ ఉర్రూతలూగించింది. బంగారుమాంబ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విస్తరణ గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. పెదగంట్యాడకు చెందిన బూస అప్పారావు ఈ నెల 21న మధ్యాహ్నం బైక్‌పై తన భార్య గురువుతల్లితో ప్రగతి మైదానం వైపు వెళ్తుండగా.. ప్రగతి మైదానం మలుపు వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పారావుకు స్వల్ప గాయాలు కాగా, గురువుతల్లికి తుంటి ఎముక విరిగి పోయి నడుముకు బలంగా గాయాలయ్యాయి. వెంటనే ఆమెను గాజువాకలో ఆస్పత్రికి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె సోమవారం ఉదయం మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో హెచ్‌సీ పాత్రుడు నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లి అమ్మవారికి సారె సమర్పణ



సారెను ఊరేగిస్తున్న మహిళలు



పైడితల్లి అమ్మవారికి సమర్పించిన సారె

గాజువాక : పాత కర్ణవానిపాలెం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి సోమవారం సారె సమర్పించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు వివిధ రకాల పళ్లు, స్వీట్లతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి సారెను అందజేశారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నిర్వహించనున్న నేపథ్యంలో సారెను సమర్పించినట్టు గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పెద్ద పండగ సందర్భంగా బళ్ల వేషాలతో ఊరేగింపుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, మడగల కన్నయ్య, గొంతిన దేముడు, కరణంరెడ్డి రాము, సాలాపు నూకరాజు, కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలు కేటాయించాలి

అగనంపూడి: నగరంలోని ప్రధాన రహదారుల్లో, కూడళ్లలో రాంగ్ పార్కింగ్ చేసే వాహనాల నుంచి భారీ స్థాయిలో అపరాధ రుసుం వసూలు చేయనున్నట్టు నగర కమిషనర్ ప్రకటించారని, అయితే అదే స్థాయిలో షాపింగ్ మాళ్లు, వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్‌కు సరైన ప్రదేశం ఉండేలా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు కోరారు. అగనంపూడిలో ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ వాణిజ్య సముదాయాలు పార్కింగ్ కోసం సెల్లార్లు ఖాళీగా ఉంచాల్సి ఉన్నా.. పట్టించుకోకుండా నిర్మాణాలు సాగిస్తుంటే జీవీఎంసీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. అందువల్లే పార్కింగ్ సమస్య తలెత్తుతోందన్నారు. ఈ విషయంలో జీవీఎంసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కసా పద్మరాజు, మాడిశ అప్పారావు, కట్టా పైడిరాజు, మైది రామచంద్రరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం వంటలపై పోటీలు



పోటీల్లో వంటలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గాజువాక : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంటలపై కుక్ కమ్ హెల్పర్లకు సోమవారం పోటీలను నిర్వహించారు. మిందిజిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 40 మంది కుక్‌లు హాజరయ్యారు. వారు వారం మొత్తం అందజేస్తున్న మెనూపై పోటీలను నిర్వహించారు. ఎవరు ఏ వంటకం చేయాలన్న విషయాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేసి పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గురు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వంటలు వండే ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. శుభ్రత విషయంలో పాటించాల్సిన అంశాలను వివరించారు. యూ ట్యూబ్ ద్వారా లభించే చిట్కాలను కూడా ఉపయోగించుకుని మరింత రుచికరమైన భోజనాలను విద్యార్థులకు అందించాలని విద్యాశాఖాధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు బి.విశ్వనాథం, ఎం.సునీత, ఎండీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఎ.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శునకాల స్వైర విహారం



పిట్టవానిపాలెంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పిట్టవానిపాలెంలో కుక్కల బెడద ఇటీవల ఎక్కువైంది. కుక్కలన్నీ గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. చిన్న పిల్లల చేతుల్లో ఏమైనా ఉంటే చాలు వారిని వెంబడించి ఆ వస్తువులను లాగేస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వాహనాచోదకులు సైతం ఆ గ్రామం వద్దకు వచ్చేసరికి భయపడుతున్నారు. రోజురోజుకూ వీటి బెడద ఎక్కువవుతోందని, జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పిట్ట సంజీవరెడ్డి కోరుతున్నారు.

అణువణువూ జల్లెడ



సాయినగర్ కాలనీలో సీజ్ చేసిన వాహనాలతో సబ్బవరం పోలీసులు



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ పిన్నింటి రమణ

- సాయినగర్‌లో కార్డన్ సెర్చ్
- 265 గృహాల్లో ముమ్మరంగా తనిఖీలు
- 26 మోటారు వాహనాల సీజ్

సబ్బవరం: శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. నేరాలు కట్టడి చేయడానికి నడుంబిగించారు. దీనిలో భాగంగా కార్డన్ సెర్చ్ ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో నిందితులు, అనుమానితులు ఉంటే తప్పించుకునే అవకాశం లేకుండా తెలతెలవారక ముందే నిర్దేశించుకున్న ప్రాంతాలను పోలీసులు చుట్టుముడుతున్నారు. ఆ తర్వాత ప్రతి ఇంటితో పాటు ఆ ప్రాంతాల్లో ఉన్న వాహనాలను పరిశీలిస్తున్నారు. రికార్డులు సక్రమంగా లేని వాటిని సీజ్ చేస్తున్నారు. అనుమానితులు ఉంటే అదుపులోకి తీసుకుంటున్నారు.

అలజడి

మండలంలోని సబ్బవరం సాయినగర్ కాలనీలో సోమవారం అలజడి రేగింది. కాలనీవాసులు నిద్ర మత్తులో ఉండగానే సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 45 మంది వరకు పోలీసులు కాలనీలోని 265 గృహాలను పరిశీలించారు. వాహనాలను తనిఖీ చేశారు. సరైన డాక్యుమెంట్లు లేని 26 మోటారు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అపరిచిత వ్యక్తులు, వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్థానికులు ఎవరైనా తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, మారణాయుధాలు కలిగినా అటువంటి వారి గురించి సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. తాము సీజ్ చేసిన మోటారు వాహనాలకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు తీసుకొచ్చిన వారికి మోటార్ సైకిళ్లు అప్పగించడం జరుగుతుందన్నారు. సీజ్ చేసిన వాహనాలను కోర్టులో హాజరు పరిచి న్యాయస్థానం తీర్పును అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రజల మనిషి పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక : సీపీఎం దివంగత నేత పుచ్చలపల్లి సుందరయ్యకు ఆ పార్టీ గాజువాక నాయకులు సోమ వారం ఘనంగా నివాళులర్పించారు. సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని 67వ వార్డు జోగవానిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాన్ని ప్రజలకోసం త్యాగం చేశారన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ తన యావదాస్తిని సీపీఎంకు విరాళంగా ఇచ్చేసి నిరాడంబరంగా జీవితాన్ని గడిపిన త్యాగశీలి అన్నారు. ఆయన ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్నప్పుడు ఏ రకమైన ఆర్భాటాలకు పోకుండా సొంత సైకిల్‌పై చట్టసభలకు వెళ్లి, ప్రజా సమస్యలను చర్చించేవారన్నారు. ప్రతి ఒక్కరూ సుందరయ్య అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పి.లక్ష్మణస్వామి, డాక్టర్ ఎం.రమేష్ కుమార్, కె.సంతోషం, కె.రాజేశ్వరి, గరిమెళ్ల పద్మజ, పాలూరి దేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.